

విద్యార్థినిని సన్మానించిన కలెక్టర్

తాంసి, జూన్6: మండలకేంద్రానికి చెందిన జింక పల్లవి టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పల్లవిని జిల్లా కలెక్టర్ రాజార్షిషా శాలువాతో, పూలమాలలతో సన్మానించారు. ఆ విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యత గల ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రతీఒక్కరు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



• వెంచర్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనులు

» అసైన్డ్ భూముల చుట్టూ పొలిటికల్ గేమ్

» వివాదాస్పద భూములను సెటిల్ చేస్తూ పాగా

» సర్వే నెంబర్ 72/3లో నేతల బినామీ బాగోతం

» పార్కు స్థలాలు కబ్జా.. ఆపై అమ్మేస్తున్న వైనం

» ఇటీవల మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేసిన సొసైటీ సభ్యులు

» అన్నీ తెలిసినా అడిగేందుకు జంకుతున్న అధికారులు



• సర్వే నెంబర్ 72/3లో ఏర్పాటు చేసిన వెంచర్ ఇదే..

ఖద్దరు మాఫియా!

ఆదిలాబాద్, జూన్6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల భూములపై ఖద్దర్ నేతల కన్నుపడి అసలు కనిపించకుండానే పోతున్నాయి. రాజకీయ పలుకుబడి, రెవెన్యూ చట్టాల్లో లొసుగులు, తెలివితేటలను పెట్టుబడిగా పెట్టి కొందరు నేతలు విలువైన భూములను చౌకాధరలకే కొట్టేస్తున్నారు. ఇప్పటికే వందలాది ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోగా తాజాగా మరో 10 ఎకరాల స్థలాన్ని గుప్పిట్లో పెట్టుకుని అడ్డదారిలో అమ్మేసేందుకు పక్కాగా ప్లాన్ చేస్తున్నారు. మావల మండలం బట్టిసావర్గాం శివారు ప్రాంతంలోని కొత్త కలెక్టర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న 72/3 సర్వేనెంబర్‌లో గల 10ఎకరాల స్థలంపై కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. గతంలోనే రాజీవ్‌స్వగృహఅధికారులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో ఆర్డీవో ఇచ్చిన ఎన్‌వోసీని అదనపు కలెక్టర్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అయిన యథేచ్ఛగా లేఅవుట్ ఏర్పాటుచేసి ప్లాట్లను అమ్మేసుకుంటున్నారు. ఈస్థలంపై రాజీవ్‌స్వగృహ అధికారులు కోర్టులో కేసు కూడా వేశారు. కానీ కోర్టుకు ఆధారాలు చూపలేకపోయారు. దీంతో రంగంలోకి దిగిన ఖద్దర్ మాఫి యా రికార్డులను తారుమారు చేసి నకిలీ పత్రాలను సృష్టించి తమకు అ నుకూలంగా మల్చుకుని కోట్ల రూపాయల విలువైన భూమిని గుప్పిట్లో పెట్టుకున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి.

• 30లక్షల ప్లాట్ రూ.9.50 లక్షలకే..

సాగు కోసం కేటాయించిన భూమిని చౌక ధరలకే కొనుగోలు చేసిన ముగ్గురు వ్యక్తుల నుంచి ఓ నేత తనకున్న పొలిటికల్ పలుకుబడితో రూ.30లక్షల విలువ చేసే ఒక్కో ప్లాట్‌ను కేవలం రూ.9.50లక్షలకే కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. మరోనేత అడ్డు చెప్పడంతో ఆయనకు కూడా 3 ప్లాట్లను గిఫ్ట్‌గా రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికి అసైన్డ్ భూముల్లో అమాయకులను ముందుంచి తెరవెనుక అస లు తతంగాన్ని నడిపస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్లాట్ల విలువ రూ.30లక్షల నుంచి రూ.45లక్షల వరకు ఉంటుందని తెలుస్తోంది. పక్కనే కొత్తకలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం కావడంతో ప్రస్తుతం వీటి విలువ మరింత పెరిగినట్లు చెబుతున్నారు. ఎకరం రూ.కోట్ల విలువ పలుకుతోంది. వివాదస్పదా భూములను సెటిల్ చేస్తూ తక్కువ ధరలకే కొట్టేయడం ఆ నేతకు అలవాటుగానే మారిందంటున్నారు. న్యాయం కోసం వెళ్తే అసలుకే మోసం వచ్చిందన్న టాక్ విన్పిస్తోంది. ఇలా ఆపదలో ఉన్న అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఓ నేత చక్రం తిప్పాడనే ఆరోపణలు వస్తున్నాయి.

• తెలివిగా ప్లాన్

రూ.కోట్ల విలువ చేసే 72/3 సర్వే నెంబర్‌లో 10 ఎకరాల స్థలాన్ని కొట్టేసేందుకు ఓ నేత తెలివిగా ప్లాన్ చేసినట్లు సమాచారం. తన పేరిటా కాకుండా కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువుల పేరిటా మొదట రిజిస్ట్రేషన్‌చేయించి బినామి భాగోతానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా కోర్టుకు వెళ్లి న్యాయం చేయాలంటూ కేసులు వేసి తనకు అనుకూలంగా మార్చుకున్నాడన్న టాక్‌వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ నేత గుప్పిట్లో 72/3 సర్వే నెంబర్‌లో సుమారుగా 130 నుంచి 150 వరకు ప్లాట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కోప్లాటు విలువ రూ.40లక్షలు అనుకున్నా 130 ప్లాట్లకు సుమారుగా రూ.50కోట్ల విలువ ఉన్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన 10ఎకరాల స్థలం విలువఏ మేరకు ఉంటుందో తెలుస్తూనే ఉంది. ప్లాట్లను కొనుగోలు చేసిన సమయంలోనూ తెలివిగా ఒకరిద్దరు సన్నిహిత నేతలపై ఒప్పందపత్రం రాసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అదే అగ్రిమెంట్‌పై ప్లాట్లను విక్రయిస్తూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కొన్ని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నం చేసిన ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ ఆపేయడంతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

• కనిపించని పార్కు స్థలం

సర్వే నెంబర్ 72/3లో నిబంధనలకు విరుద్ధంగా లేఔట్‌ను ఏర్పాటు చేసి పార్కు స్థలాన్ని కూడా అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా మొత్తం లేఔట్ విస్తీర్ణంలో 10 శాతం స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించాలి. కానీ ఇలాంటి నిబంధనలు ఎక్కడ పాటించినట్లు కనిపించడం లేదు. అయిన అధికారులు అనుమతులు ఇవ్వడం ఆ వెంటనే రిజిస్ట్రేషన్లు కూడా జరిగి పోవడం గమనార్హం. ప్రభుత్వ భవనాలు, మందిరాలు, పార్కులు నిర్మించేందుకు 10శాతం స్థలాన్ని కేటాయించకుండానే లేఔట్ ఏర్పాటు చేసి అమ్మేసుకుంటున్న అధికారులు అడ్డుచెప్పక పోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. కోర్టుఆదేశాలు ఉన్నాయంటూ అధికారులు చెబుతున్నారు. అయిన 10శాతం స్థలాన్ని ఎందుకు కేటాయించలేదో అడిగేందుకు అధికారులు జంకుతున్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు కొంత మంది సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేసిన కదలిక కనిపించడం లేదంటున్నారు. దీని పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిని సారిస్తే కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కాపాడుకునే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్లు

• విజయ్‌కాంత్‌రావు (సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్)

అసైన్డ్ భూముల సర్వే నెంబర్లను పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. లింకు డాక్యుమెంట్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉంటుంది. ఏమైనా ఫిర్యాదులు వస్తే రిజిస్ట్రేషన్ నిలిపి వేసి పరిశీలిస్తున్నాం. నిషేధిత జాబితాలో ఉన్న అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉండదు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్వే నెంబర్ల ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేస్తున్నాం.



సంక్షిప్త సమాచారం



సీఎంతో మాట్లాడుతున్న రేఖా శ్యామ్‌నాయక్

సీఎంను కలిసిన అజ్మీరా రేఖా శ్యామ్‌నాయక్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 6: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీరాశ్యామ్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలుప్రాంతాల్లో ఉన్న ప్రధాన సమస్యలపై సీఎంకు వివరించారు. కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్నో గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వారిప్రత్యేక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సీఎం సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని హామీఇచ్చినట్లు శ్యామ్‌నాయక్ ఫోన్‌ద్వారా తననియోజకవర్గ సహచరులకు తెలిపారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గోడం రమేష్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్6:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాస గృహంలో పార్లమెంట్ సభ్యుడిగా గెలచిన గోడంనగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ కార్యకర్తలు ప్రణాళికబద్ధంగా అంకిత బావంతో పని చేసి మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే విజయం సాధ్యమైందని కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయలశంకర్ వివరించారు.

పట్టణంలో పారిశుధ్య పనులు

ఉట్నూర్, జూన్6: వానాకాలం వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి ముందస్తుగా పట్టణంలోని అన్ని విధులలో పారిశుధ్య పనులు ప్రారంభించామని ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శంకర్ తెలిపారు. ఉట్నూర్ పట్టణంలోని అన్ని విధులలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో మురికి కాలువలు తీయించడంతో పాటు చెత్త కుప్పలను తొలగిస్తున్నామని మురికి నీరు ఎక్కడ కూడా ఇందులో ఉండకుండా చూసుకోవాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. మురికి నీరు నిలువ ఉంచితే దోమలు పెరిగి వ్యాధులు సంక్రమిస్తాయని ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆయన వెంట ఎల్లమల మనోహార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజార్షిషా



1. మాట్లాడుతున్న కలెక్టర్
2. పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్6: అమ్మఆదర్శ పాఠశాలలో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని, పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. గురువారం కలెక్టర్ రాజార్షిషా తన చాంబర్‌లో అమ్మఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమ్మఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులుకల్పనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న తాగునీరు, టాయిలెట్స్, మైనర్‌రిపేర్, మేజర్ రిపేర్, బాలికల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్ పనులను ఇప్పటి వరకు ఎన్ని పూర్తయినవి, ఇంకా ఎన్ని పనులు చేపట్టవల్సి ఉన్నవి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకొని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను లక్ష్యంగా నిర్దేశించుకొని స్కూల్ తెరిచేలోపు పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేయించాల్సిన బాధ్యత ఆయా యజమాన్యాలపై ఉందని, నిధుల అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి నిధుల కొరత లేనందున త్వరగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టక ముందు, పనులు చేపట్టిన తర్వాత ఫొటోలు పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాంలను పాఠశాల పున: ప్రారంభం కావడానికి ముందే యూనిఫాంలు ఆయా పాఠశాలలకు సకాలంలో అందించేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారును ఆదేశించారు. ఇందులో విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బడిబాట ర్యాలీలు

• బడీడు పిల్లలను బడికి పంపాలి

• ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమోహన్



కాటా(బి)లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మేడిగూడ బడిబాటలో పాల్గొన్న ప్రజలు ఉపాధ్యాయులు

బోథ్, జూన్6: మండలంలో గురువారం అన్ని గ్రామాల్లో బడిబాట ర్యాలీలు సాగుతున్నాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు ర్యాలీలో పాల్గొన్నారు. ఐదేళ్లు నిండిన ప్రతీ పిల్లవాడిని పాఠశాలలో చేర్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బడిఈడు పిల్లల్ని బడికి పంపాలని, ఇంట్లో ఉంచి కూలీలుగా మార్చవద్దంటూ నినాదాలు చేశారు. పిల్లలను కూలీలుగా మార్చితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని సందర్భంగా వివరిస్తూ బ్యానర్లతో ఊరేగించారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

తలమడుగు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందుతుందని, మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం ఉంటుందని, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, నోట్ పుస్తకాల పంపిణీ కూడా ప్రభుత్వ పాఠశాలలో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఈఓ వినోద్‌కుమార్, హెచ్‌ఎం వెంకట్రావ్, ఉపాధ్యాయుల వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలంలోని ఎంకా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బడిబాట ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు గణేష్‌రాథోడ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించి గ్రామంలో ఉన్న బడి ఈడు ఉన్న ప్రతి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు రుక్మినిబాయి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని మేడిగూడ(ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యవాన్‌చిక్టె అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా జైనథ్ మండలంలోని మేడిగూడ (ఆర్)గ్రామంలో విద్యార్థులు ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం కొనిగెల నారాయణ, అమ్మఆదర్శ పాఠశాల ఛైర్మన్లు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెస్రం రేణుక, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబులాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఇచ్చోడ: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి హజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కేస్లాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఎమ్మెల్యేతో ఫోన్‌ఇన్‌కు స్పందన

ఉట్నూర్, జూన్6: ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజల నుంచే తెలుసుకొని, ఆ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ వినూత్న రీతిలో చేపట్టిన ఫోన్‌ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే అనే కార్యక్రమానికి స్పందన లభించింది. ఉట్నూర్ మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడెం, జన్నారం, పెంబి, దస్తూరాబాద్,సిరికొండ మండలాల నుంచి వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్థులు, ఉద్యోగులు వందలాది మంది ఫోన్ ద్వారా ఎమ్మెల్యేతో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న నీటి, రోడ్డు, డ్రైనేజీ, కరెంట్ మిషన్ భగీరథ, జీవో నెంబర్3, ఫారెస్టు, ఈజవో నెంబర్ 317, భూమికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు.

తలమడుగులో భారీ వర్షం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిన నీరు

తలమడుగు, జూన్6: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం కురిసిన మొదటి వర్షానికి తహసీల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం జలమయం కావడంతో అధికారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామాల్లోని రోడ్లన్నీ బురదమయమయ్యాయి. గ్రామంలోని మురికి కాల్వలు నిండి రోడ్లపైనే ప్రవహించడంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వచ్చేవర్షాకాలంలో వ్యాధుల ప్రవరకొండ అధికారుల ముందస్తు చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

బరంపూర్‌లో పిడుగుపాటుకు ఎద్దు మృతి

మండలం బరంపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలంలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పిడుగుపడడంతో ఎద్దు మృతిచెందింది. వ్యవసాయ పొలంలోని చెట్టు కింద ఉన్న ఎడ్లపై పిడుగు పడడంతో ఒక ఎద్దు మృతిచెందగా, మరో ఎద్దుకు తీవ్రగాయాలయ్యాయి. రైతు సంపత్ రామన్న మృతి చెందిన ఎద్దును చూసి బోరున విలపించాడు. కాగా పిడుగు పాటుకు మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ.50 వేల వరకు ఉంటుందని రైతు రామన్న ఆవేదన వ్యక్తం చేశాడు.



• మృతి చెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న రైతు

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట


కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు


గాజలిలో కప్పతల్లి ఆడుతున్న గాజలి గ్రామస్థులు

ఇచ్చోడ, జూన్6: వానకాలం పంటల సీజన్ ప్రా రంభమైన నేపథ్యంలో.. మండలంలోని పలు గ్రా మాల్లోని రైతులు పత్తి విత్తనాలు విత్తుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో వర్షాలు కురవాలని గురువారం ఇచ్చోడ మండలం అడేగామ(కె)గ్రా మపంచాయతీ పరిధిలోని గుబ్బా గ్రామంలో గ్రా మస్థులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశా రు.ఇద్దరు చిన్నారులు వారిభూజాలపై రోకలి దుడ్డుకు కప్పను కట్టి ప్రతి ఇంటి ముందరికి చి న్నారులు వెళ్లి నీళ్లు పోయడంతో చివరికి బావిలో వేసిన కప్ప ఏటువైపు పయనిస్తుందో అటువైపు నుంచి వర్షాలు పడతాయ పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం.

నేరడిగొండ:గాజిలి గ్రామంలో గురువారం సంవృద్ధిగా వర్షాలుకురవా లని కోరుతూ గ్రామస్థులు కప్పతల్లి ఆటలాడారు.వర్షాకాలం ప్రారంభమైన తమ గ్రామంలో వర్షాలు కురవడం లేదని కప్పతల్లి ఆటలాడారు. యువ కులు చిన్నారులు కప్పతల్లిని ఇంటింటి ఊరేగిస్తూ పాటలు పాడుతు గ్రా మ విధుల గుండా తిరిగారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు

ఇంద్రవెల్లి, జూన్ 6 : బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్ చార్జి భూక్యా జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జాన్సన్ అన్న యువసేసన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌కు వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరెంగ సుంకట్‌రావు, ఎంపీటీసీ మడావి భీంరావు, మండల కో ఆప్షన్ సభ్యులు మిర్జా జిలాని బేగ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అంజద్, నాయకులు సర్కాలే శివాజీ, ధరణి ధనరాజ్, గేడం భారత్, సిరికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌సెట్ దరఖాస్తుకు చివరి తేది30

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 6: ఇంటర్మీడియట్ పూర్తిచేసి డైట్‌లో చేరాలను కునేవారు వచ్చేనెల 10ననిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల30 చివరి తేదీ అని డీఈవో అశోక్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవ్వు కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం


కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం సమర్పిస్తున్న యువకులు

తాంసి, జూన్ 6 : ఏదైనా సర్టిఫికెట్ అడిగితే తొందరగా స్పందించడం లేదం టూ గ్రామ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్‌కు తాంసి గ్రామ యువకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఏదైనా సర్టిఫికెట్ కావాలని వెళితే తమను సతాయి స్తున్నాడని కలెక్టర్‌కు విన్నవించారు. ఇక నుంచి అయినా తమకు అందుబాటులో ఉంటూ తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో నగరం అశోక్, లోకల్ రాముడు, కిషన్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా బస్సు షెల్టర్‌ను నిర్మించిన సొసైటీ అధ్యక్షుడు

భోథ్, జూన్ 6 : పుట్టిన రోజు సందర్భంగా ఆర్భాటాలకు పోకుండా అందరికీ ఉపయోగపడే విధంగా బస్సు సెంటర్ నిర్మాణాన్ని అనిల్ మాసం నిర్మించారు. తన తల్లి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఆదర్శ పాఠశాల సమీపంలో విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా బస్ షెల్టర్‌ను నిర్మించారు. పుట్టిన రోజు సందర్భంగా వృథాగా ఖర్చు చేయకుండా పలువురికి ఉపయోగపడే విధంగా షెల్టర్ నిర్మాణంచేపట్టడం పట్ల ఆయనను అభినందించారు. బస్సు షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుర్గా కమిటీ అధ్యక్షులు పాలిగ్ రమేష్, విద్యార్థి అధ్యక్షులు పుండు రాకేష్‌రెడ్డి, మెరుగు సాయి, బీజేపీ యువ నాయకుడు సాయి రోహిత్, రాము, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రయాణీకుల కోసం బెంచ్ ఏర్పాటు చేసిన యువకులు

మండలంలోని వెంకటేశ్వర ఆలయం గురుకుల పాఠశాల ఆదర్శ పాఠశాల వద్ద విద్యార్థులు, ప్రజల అవసరాల కోసం బోథ్‌కు చెందిన సైనిక యూత్ సభ్యులు ఆలంబన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బెంచీలను వేయడం జరిగింది. యువజన సంఘాల వారు ముందుకు వచ్చి ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేస్తున్న బెంచీలు ఇతరులకు ఆదర్శంగా ఉంటాయి.

బడి బట్టలు ఏ మేరకు తయారయ్యాయి?

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



తాంసిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్

తాంసి, జూన్ 6 : బడి పిల్లల బట్టలు ఏ మేరకు తయారయ్యాయి. అవి ఎలా కడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్ని జతలు తయారు అయ్యాయి. అనే విషయంపై జిల్లా కలెక్టర్ ఆరాతీశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రాజర్షిషా తాంసి మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా పని చేస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. విద్యార్థులకు విద్య సంవత్సరం ప్రారంభం ముందే పాఠ్య పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేయాలని సూచించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్ర మం ప్రారంభమైందని ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాల అనుసారం విధు లు నిర్వహించాలన్నారు. ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాలపై స్థానిక ప్రజలతో సమావేశం కావాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● బట్టలు కుట్టే వారి దగ్గరికి వెళ్లి...

జిల్లా కలెక్టర్ గురువారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు ఎన్ని దుస్తులు కుట్టుడు అయ్యాయో స్వయంగా బట్టలు కుటుతున్న వారి ఇళ్ళ వద్దకు వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ రెండున్నర గంటల పాటు ఆయన మూడు కేంద్రాల్లో బట్టలు కుట్టుతున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ గారమంలో పర్యటించడంతో జనం ఆయనకు చప్పట్లతో స్వాగతం పలికారు. ఇంకుడు గుంతల పూడికతీతపై కూడా ఎంపీడీవోకు ఆదేశాలు జారీచేశారు. అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు.

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలలోగల తమ తల్లిదండ్రుల పిల్లను ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జైనథ్‌మండల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మద్దిలన్మన్న అన్నారు.గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన జైనథ్‌లో విద్యార్థులు గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌శ్రీం ఎం.లన్మన్న మాట్లాడుతు బడీడు పిల్లలను ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్మన్‌లు పి.వెంకటమ్మరెడ్డి, గంగమ్మ, జైనథ్ తాజామాజీ సర్పంచ్ డి.దేవన్న, ఎంపీటీసీ కె.సుదర్శన్, పీఎస్‌హెచ్‌ఎం ఎ.రాములుతో పాటు గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ: 11 నుండి 14 సంవత్సరాల వయసు కల్గిన బాలికలను కేజీబీవీలో చేర్పించాలని ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘం మహిళా సభ్యులు, ఏఏపీసీ సభ్యులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంధ్యారాణి మాట్లాడుతూ...అర్హులైన బాలికలకు 6 నుండి 12వ తరగతి వరకు మంచి వసతి, ఆవాస ఏర్పాట్లతోపాటు అన్ని వర్గాల బాలికలకు గుణాత్మక విద్యను, వారి అభిరుచి, ఆసక్తిలకనుగుణంగా త్వరగా జీవితంలో స్థిరపరిచే ఉద్దేశ్యంతో వృత్తి విద్యను, ఆత్మరక్షణ విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, ఏఏపీసీ సభ్యులు, ఎస్‌ఎచ్‌జీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీంపూర్: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్యామ్‌సుందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మహేష్, వీర కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



పొన్న ఎక్స్‌రోడ్డు విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

సిరికొండ, జూన్ 6: రైతులకు కావాల్సిన విత్తనాల కొరత సృష్టించి, ఎమ్మార్పీ ధరలకంటే అధిక ధరకు విక్రయిస్తే అట్టి డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఇంచార్జీ వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. గురువారం మండలంలోని పలు విత్తన విక్రయ దుకాణాలను గుడిహత్నూర్ తహసీల్దార్ కవితారెడ్డి, సిరికొండ డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్‌తో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో విత్తన స్టాక్, రిజిష్టర్, గ్రౌండ్‌స్టాక్, బిల్‌బుక్స్, స్టాక్‌బోర్డులను పరిశీలించారు. అనంతరం రైతులకు పంటల సాగు గురించి సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విత్తన విక్రయదారులు రైతులకు కావాల్సిన నాణ్యమైన, మంచి దిగుబడినిచ్చే పత్తి విత్తనాలను అందించాలని, నకిలి పత్తి విత్తనాలను విక్రయించరాదని సూచించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల పత్తి విత్తనాల బ్యాగులు మండలంలో 7300 వరకు అందుబాటులో ఉంచడం జరిగింది అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఉపేందర్, ఏఎస్సై అశోక్‌రెడ్డి, ఏఈవోలు ప్రవీణ్, ధీపక్, రెవెన్యూ సిబ్బంది అమోల్, రైతులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు సేవలు మరువలేనివి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్,జూన్6:భూ పోరాట యోధుడు సీపీఐ అగ్రనాయకులు దివంగత చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం పార్టీ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన చేసిన సేవలను మననం చేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు,అణగారిన వర్గాల కోసం ఎర్రజెండాను చేతబూని తన ఆస్తిని పేదలకు పంపిణీ చేసిన మహనీయుడు రాజేశ్వరరావు అని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఆయన కృష్ణ జల్లాలో తన ఆస్తులను పేదలకు అందించారన్నారు. అప్పటి నుంచి భూ పోరాటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారని తెలిపారు. 26 సంవత్సరాల పాటు సీపీఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ఇందులో పార్టీ నాయకులు నళినిరెడ్డి, అరుణ్‌కుమార్, కుంటాల రాములు తదితరులు పాల్గొన్నారు.

భారీగా గుట్కా స్వాధీనం

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ

ఆదిలాబాద్‌అర్బన్,జూన్6:రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన గుట్కాను విక్రయించిన, నిల్వ చేసిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని తాంసిబస్టాండ్ ప్రాంతంలో మహారాష్ట్రనుంచి గుట్కాను కొనుగోలు చేసి నకిలీ గుట్కాను తయారు చేసే వారిని పట్టుకున్నారు. గురువారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అశోక్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీజీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిషేదిత గుట్కా ఎవరు విక్రయించిన నిల్వ చేసిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు తాంసి బస్టాండ్ ప్రాంతంలో దాడులు నిర్వహించి మహారాష్ట్రకు చెందిన మజా కంపెనీ తంబాకులో కల్తీ చేస్తున్నట్లు గుర్తించారన్నారు. అక్కడి మిషన్‌తో పాటు వర్కర్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గుట్కాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు గుండావార్ రాకేష్ గోదాం(జిన్నింగ్‌మిల్లు)లో దాడులు నిర్వహించామన్నారు. అక్కడ మిషన్ ద్వారా మజా కంపెనీ డబ్బాల్లో తంబాకును కల్తీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అక్కడ పని చేస్తున్న ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా రిజ్వాన్‌తో కలిసి కల్తీ చేస్తున్నట్లు తేలిందన్నారు. పట్టుకున్న తంబాకు విలువ రూ.4లక్షల 40వేల వరకుఉంటుందన్నారు. కాగా ఇర్ఫాన్ అదుపులో ఉన్నాడని, రిజ్వాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సమాజ సేవలో పోలీసులు ముందుంటారు

● ఏఎస్పీ సురేందర్‌రావు



సూర్యగూడలో మాట్లాడుతున్న ఏఎస్పీ బి.సురేందర్‌రావు

గుడిహత్నూర్, జూన్6:శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సమాజ సేవలో పోలీసులు ముందుంటారని ఏఎస్పీ బి.సురేందర్ రావు అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ గ్రామంలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఏఎస్పీ పోలీసు అధికారులను గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని గిరిజనులు అనారోగ్యం, ధీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించి పోలీసు శాఖ తరపున వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, వార్టికల్ డీఎస్పీ పి.శ్రీనివాస్, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబుల్లా, ఇచ్చోడ సీఐ భీమేష్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, నేరడిగొండ ఎస్సైలు సయ్యద్ ఇమ్రాన్, డి.సునీల్, శ్రీకాంత్, డాక్టర్లు శ్యామ్‌సుందర్, అభిజిత్, ప్రీతల్, రాజు, రిమ్స్ వైద్యులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తొలకరితో పులకరించిన రైతన్న

● పంట పొలాలో విత్తనాలు నాటుతున్న రైతులు

తలమడుగు, జూన్6:జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో గురువారం కురిసిన భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ శుద్ధి చేసి ఉన్న పంట పొలాల్లో పత్తి విత్తనాలను నాటడం ప్రారంభించారు. మండలంలో ఎక్కువ మంది రైతులు పత్తి పంట సాగు చేయడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంట ప్రారంభించారు. వారం రోజుల ముందే విత్తనాలను కొనుగోలు చేశారు. వర్షం ప్రారంభంతోనే విత్తనాలు నాటితే ముందుగానే పంట చేతికి వస్తుందని కొండంత ఆశతో రైతులు, ఖరీఫ్ పనులను ప్రారంభించారు.నీటి వసతి కలిగిన రైతుల మాత్రం ముందస్తుగానే పత్తి విత్తనాలను నాటేశారు. కాగా మరికొంత మంది రైతులకు పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక దళారుల వద్దకు బ్యాంకుల చుట్టు ప్రదక్షిణలుచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు రైతుబంధు డబ్బులు త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

నిర్మల్ అర్బన్, జూన్ 6 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దిలావర్‌పూర్ మండలం(కంజర్) కాంగ్రెస్ పార్టీ కోశాధికారి నిమ్మ సాయి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో గురువారం దేవేందర్ రెడ్డి ఆసుపత్రిలో నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని, ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ దేవేందర్ రెడ్డితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శ్రీహరి రావు వెంట నాయకులు ఎంబడి రాకేష్, డా. ఈసవేని మనోజ్ యాదవ్, మండల నాయకులు కోడె విజయ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

నర్సాపూర్(జి),మే6: మండలంలోని చాక్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ అధికారులుగా నిర్మల్ జిల్లా జడ్‌పీ సీఈవో గోవింద్, ప్రెసెంటింగ్ ఆఫీసర్‌గా సుధాకర్‌రెడ్డి గురువారం చాక్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచా రణ చేపట్టారు. గతంలో రికార్డుల నిర్వహణలో నిర్లక్షం వహించిన పంచా యతీ కార్యదర్శి నారాయణ పై విచారణ చేసి చార్జ్ మోమోకి సంజాయిషీ ఇవ్వవలసిందిగా కోరారు. విచారణలో అధికారుల గైరాజరుపై పలు అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని లోతుగా విచారణ చేస్తే కాజేసిన నిధులు బయట పడతాయని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యాక్రమంలో భైంసా యంపీడీవో సుధాకర్ రెడ్డి, నర్సాపూర్ జి యంపీడీవో పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ అనంత విశ్వేవర్, గతంలో పనిచేసిన కార్యదర్శి నారాయణ, చాక్‌పల్లి కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కుంటాల, జూన్6: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ స్టేట్ సీడ్స్ మేనేజర్ అతుల్ కుమార్ జైన్, టెక్నికల్ ఏడీఏ విద్యాసాగర్, టెక్నికల్ ఏవో వినోద్, కుంటాల ఏవో సోమలింగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కల్లూర్, కుంటాల తదితర గ్రామాలలో ఎరువుల, విత్తనాల దుకాణాలను తనిఖీచేశారు. దుకాణం డీలర్లు ప్రతీరోజు రికార్డులను మెయింటెన్ చేయాలని, రైతులకు విత్తనాలు విక్రయించిన సమయంలో రశీదు అందజేయాలన్నారు. లూజు విత్తనాలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.



కెనాళ్లు ఇలా.. నీళ్లు ఎలా..?

- అధ్వానంగా జిల్లా కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు కెనాళ్లు
- రిపేర్లకు ఎలాంటి అంచనాలు తయారు చేయని వైనం
- వర్షాలు కురిస్తే పనులు కష్టమే..

నిర్మల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపు ఒక లక్ష 30 వేల ఎకరాలకు సాగు నీరందించే కడెం, సరస్వతి, స్వర్ణ, గడ్డెన్న వాగు, సదర్మాట్ కాలువల మరమ్మతులపై అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి అన్ని కాలువల ద్వారా ఆయా ప్రాజెక్టుల నీరు పంట పొలాలకు పూర్తిస్థాయిలో అందాల్సి ఉన్నప్పటికీ ఏళ్ల నుండి సరైన మరమ్మతులు లేక లేట్ ఎండ్ వరకు నీళ్లు అందడం లేదంటున్నారు. ప్రతీ ఏటా రైతులు వేసవి కాలంలోనే ఈ కాలువలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల మరమ్మతులకు నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో వీటి పరిస్థితి అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు ప్రతీ ఎండాకాలంలో మరమ్మతులకు సంబంధించి అంచనాలు తయారు చేయడం, వాటిని సర్కారుకు పంపడం, సర్కారు అంచనాల నివేదికలను పక్కన పెట్టడం రివాజుగా మారిందంటున్నారు. అయితే ప్రతిఏటా తాము తయారు చేస్తున్న అంచనాలకు మోక్షం లభించకపోవడంతో ఇరిగేషన్ అధికారులు సైతం తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈసారి కూడా జిల్లాలోని ప్రధాన కాలువల మరమ్మతులకు సంబంధించి ఇప్పటివరకు పూర్తిస్థాయి ప్రతిపాదనలు రూపొందలేదంటున్నారు. ఈసారి మరమ్మతులు జరగకపోతే కాలువల ద్వారా నీటి ప్రవాహం పూర్తిస్థాయిలో ముందుకు సాగడం కష్టమేంటున్నారు. చాలా చోట్ల కాలువల్లో పూడిక పేరుకుపోవడం, లైనింగ్ దెబ్బతినడం అలాగే కట్టలు బలహీన పడడం వీటికి తోడుగా గండ్లు ఏర్పడడం సహజంగా మారిందని అంటున్నారు. పూడికతో పాటు కాలువల మధ్య పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు మొలిచి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయంటున్నారు. కాలువలకు గండ్లు పడిన సమయంలో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయకపోవడంతో ఈ కాలువల ద్వారా పంట పొలాలకు నీరందించడం కష్టతరమవుతుందని చెబుతున్నారు. ఈసారి కూడా మనం మరమ్మతులు జరగకపోతే పంట పొలాలకు నీరందడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో ఆయకట్టు రైతులు

జిల్లాలోని ప్రధాన కాలువలకు మరమ్మతులు జరగకపోతుండడంతో ఆ కాలువల కింది ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. సరస్వతి కాలువల కింద 38వేల ఎకరాలు, కడెం కాలువల కింద 63 వేల ఎకరాలు, స్వర్ణ ప్రాజెక్టు కింద 10వేల ఎకరాలు, సదర్మాట్ కాలువ కింద 6వేల ఎకరాలు, గడ్డెన్న వాగు ప్రాజెక్టు కాలువల కింద 14 వేల ఎకరాల పంట పొలాలు సాగు లక్ష్యంగా నిర్ధారించారు. 2004 సంవత్సరం వరకు ప్రతీ ఏటా మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యేవి. అయితే 2009 ఏడాది వరకు కాలువల మరమ్మతులకు ఆటంకాలు ఏర్పడలేదు. 2010 నుంచి ఒక్కసారి కాలువల మురమ్మతులపై ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిచండం మొదలుపెట్టాయి. అప్పటినుంచి ఇప్పటివరకు అధికారులు రూపొందించిన అంచనాల నుండి కొంతమేర మాత్రమే అడపాదడపా నిధులు మంజూరయ్యాయే తప్ప పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదు. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలువలపై పూర్తినిర్లక్ష్యం కొనసాగిందన్న విమర్శలున్నాయి. అధికారుల అంచనాలను అప్పటి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని చెబుతున్నారు. కాగా మరమ్మతులు సక్రమంగా జరగని కారణంగా సరస్వతి కాల్వ 1వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ నుంచి 26వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీల వరకు మొత్తం 21వేల 874 ఎకరాల ఆయకట్టు, అలాగే కడెంప్రాజెక్టు పరిధిలోకి వచ్చే డిస్ట్రిబ్యూటరీలు 27, 28కింది ఆయకట్టు భూములకు నీరందని పరిస్థితి ఏర్పడుతోంది. కడెం ప్రాజెక్టు కాలువలలో కూడా పూడిక పేరుకుపోవడం పిచ్చిమొక్కలు ఇష్టానుసారంగా మొలవడంతోపాటు లైనింగ్ చెడిపోయినప్పటికీ మరమ్మతులు జరగకపోతుండడం కాలువలకు శాపంగా మారిందంటున్నారు. దీంతోపాటు 10వేల ఎకరాలకు సాగునీరు అందించే స్వర్ణ ప్రాజెక్టు కాలువ పరిస్థితి కూడా దయనీయంగా మారిందని చెబుతున్నారు. చాలాచోట్ల ఈ కాలువ రూపురేఖలు మారిపోయినప్పటికీ అధికారులు నిధుల కొరత కారణంగా మరమ్మతు పనులు చేయలేకపోతున్నారు. ఇదిలా ఉండగా ఏళ్ల కింద నిర్మించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని చెబుతున్నారు. ఈ కాలువలకు మరమ్మతులు చేయక పోవడం, అలాగే చివరివరకు లైనింగ్ పనులు కూడా పూర్తి కాకపోవడం ఆయకట్టు రైతులను తీవ్రఅసంతృప్తికి గురిచేస్తోంది. ఖానాపూర్ పరిధిలోని సదర్మాట్ కాలువకు సంబంధించి కూడా మరమ్మతులు చేయాలని రైతులు ఇప్పటికే చాలాసార్లు ఆందోళన సైతం చేపట్టారు. అయితే రైతులంతా మరమ్మతుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. ఇటీవలే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఇక్కడి రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలువలకు నిధులు మంజూరు చేయాల ంటే వినతి పత్రాలు అందించారు. మంత్రి సీతక్క కడెం ప్రాజెక్టు మరమ్మ తులకు దాదాను 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించిన సంగతి తెలిసిందే. దీంతో రైతులు కాలువల మరమ్మతులకు అవసర మయ్యే నిధుల విషయంలో కూడా మంత్రి సీతక్కపై ఆశలు పెట్టుకుంటున్నారు.

కాలువలకు మరమ్మతులు చేయాలి

- బొడ్డు సాయన్న, రైతు, లక్ష్మణచాంద గ్రామం

సరస్వతి కాలువకు ప్రతిఏటా మరమ్మతులు చేయడం లేదు. దీంతో మా పంట పొలాలకు ఈ కాలువల ద్వారా రెండో పంటకు నీరందని పరిస్థితి ఏర్పడుతుంది. దాదాపు 10 ఏళ్ల నుండి సక్రమంగా మరమ్మతులు చేయడం లేదు. తామంతా రబీ సీజన్‌లో సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కాలువలన్నింటికీ మరమ్మతులు శాశ్వత ప్రాతిపదికన చేయించాలి.



గందరగోళంలో కాళేశ్వరం కాల్వలు..

జిల్లాలో లక్ష ఎకరాలకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో ప్యాకేజీ నెంబర్ 27, 28 కాళేశ్వరం హై లెవెల్ కాలువల పరిస్థితి ప్రస్తుతం గందరగోళంగా మారింది. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం చేపట్టిన ఈ కాలువల నిర్మాణానికి అడుగడుగునా నిధుల కొరత ఏర్పడడంతో ప్రస్తుతం ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం కాళేశ్వరం హై లెవెల్ కాలువల విషయంలో పెద్దగా పట్టించుకోకపోవడం రైతాంగానికి శాపంగా మారింది. అయితే ప్రస్తుత ప్రభుత్వమైనా కాళేశ్వరం కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు.



మృతి చెందిన బాలుడు మాగిర్వాడ్ శ్రీ

జిల్లాలో పిడుగు పాటుకు ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరే ప్రాంతాల్లో పిడుగు పాటుకు గురువారం ఇద్దరు మృతి చెందారు.

ఎల్వత్ గ్రామంలో బాలుడు..

తానూర్, జూన్6: మండలంలోని ఎల్వత్ గ్రామంలోని మాగిర్వాడ్ శ్రీ (12) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడు శ్రీ ప్రతి రోజు మాదిరిగానే తమకున్న మేకలను గ్రామ శివారులో మేపేందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీంతో బాలుడు పక్కనే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లగా.. అదే సమయంలో అక్కడ పిడుగు పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రవీణ్ మృతదేహం

• కాల్వలో యువకుడు..

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మోడపెల్లి ప్రవీణ్ (25) మృతి చెందాడు. ప్రవీణ్ గురువారం మధ్యాహ్నం పంటచేలకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రవీణ్ తన సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో ప్రవీణ్ కుప్పకూలిపోయాడు. పంట పొలాల్లో ఉన్న రైతులు ప్రవీణ్‌ను వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ప్రవీణ్ మృతిచెందినట్లు తెలిపారు. ప్రవీణ్‌కు ఏడాదిన్నర క్రితమే వివాహం కాగా.. ఆరు నెలల పాప, భార్య అశ్విని ఉన్నారు.

విట్టోలిలో కూలిన చెట్టు

ముథోల్: మండలంలోని విట్టోలి గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం వేళల్లో చెట్టుపై పిడుగు పడింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంకు చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. పిడుగు పడే సమయంలో చెట్టు వద్ద ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

'ఆదివాసీల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి'

సారంగాపూర్, జూన్6: ఆదివాసీల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇప్పచెలిమే, పెండల్‌దారి తండాలలో ఆయన పర్యటించి తండాలలో నెలకొని ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకొని ఫోన్‌లో సంబంధిత అధికారులకు తండాలలో నెలకొని ఉన్నటువంటి సమస్యలను వివరించారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎంబడి గంగాధర్, అట్ల పోతారెడ్డి, భీమ్‌రావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్

నిర్మల్ టౌన్, జూన్ 6: వర్షాకాలం వస్తున్న దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కాబట్టి వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠంగా నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా నిర్వహించారు. వర్షాకాలం వస్తున్న దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కాబట్టి వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠంగా నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని కోరడం జరిగింది. ముఖ్యంగా దోమల నియంత్రణకు వారానికి రెండు సార్లు డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేవిధంగా దోమల నియంత్రణకు పటిష్ఠమైన యాంటీ లార్వాల చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా దోమల నివారణకు, నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి విస్తృతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అదే విధంగా లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమన్వయతో పని చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, కార్యక్రమం నిర్వాహణాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు, ఆరగ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సమేతంగా చండీయాగ పూజలో న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

బాసరలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

బాసర, జూన్6: బాసర సరస్వతిఅమ్మవారి ఆలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగే నిత్య చండీహోమం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి పండితులు ఆశీర్వదించారు. అంతకుముందు న్యాయమూర్తికి దేవస్థాన అధికారులు, పండితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు.

కాల్వ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్, జూన్6: మండలంలోని ప్రసిద్ధపురాతన దేవస్థానం కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీని గురువారం లెక్కించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూ. 4,30,200 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం చైర్మన్ ఉజరం మహేష్, ధర్మకర్తలు, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు పటేల్, శివకేశవ్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

నేటి నుంచి మృగశిర

- రైతులకు అనుకూలం
- వ్యవసాయ పనులు ప్రారంభం

భైంసా, జూన్6: రోళ్లు పగిలే ఎండలు ఉండే రోహిణి కార్తి ముగిసింది. పలు ప్రయోజనాలతో కూడిన మృగశిర కార్తి శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్తి రైతులకు అనుకూలంగా ఉంటుంది. మృగశిర కార్తినుంచి అన్నదాతలు విత్తనాలువిత్తి వ్యవసాయపనులను ప్రారంభిస్తారు. రైతులు ప్రతీయేటా మృగశిర కార్తికోసం ఎదురుచూస్తుంటారు. మాంసాహారులు ఈ కార్తిలో వీలునుబట్టి చేపలు తింటారు. అస్తమా, ఉబ్బసానికి చేపమందును అందిస్తుంటారు.

• చేపలకు గిరాకీ..

మాంసాహారులు మృగశిర కార్తిలో తప్పనిసరిగా చేపలు తింటారు. కార్తి ప్రారంభంలో చేపలు తినడం అనవాయితీగా వస్తోంది. శరీర సమతుల్యం, హృదయ సంబంధిత వ్యాధుల నివారణకు చేపలు తినడం మంచిదని బెబుతారు. ఎండకాలంలో వేడెక్కిన శరీరాలు చల్లబడేందుకు పోషక విలువలు పొందేందుకు చేపలు తినాలని పెద్దలు చెబుతారు. దీంతో మృగశిర కార్తి సమయంలో చేపలకు గిరాకీ పెరుగుతోంది. గురువారం నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు,కుంటల్లో చేపలను పట్టి తిరుగుతూ విక్రయాలు జరుగుతున్నాయి. చేపలు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ధరలు సైతం పెరుగుదల బాట పట్టాయి. ధరలు పెరిగిన మాంసాహారులు కొనేందుకు అసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలోని వివిధ చేపల మార్కెట్లలో ఆయా రకాల చేపలు రూ.150 నుంచి రూ600లకు కిలో చొప్పున విక్రయించబడుతున్నాయి.

మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన చేపలు





చించాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడీడు పిల్లలు బడిలో చేరాలి

ముథోల్, జూన్6: ముథోల్‌తోపాటు మండలంలోని చించాల, తరోడా, ఎడ్‌బిడ్, ఆష్ట, ముద్గల్, రాంటెక్, మచ్కల్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పిల్లలు, స్వయం సహాయక సంఘాల మహిళలు గురువారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వపాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే ప్రభుత్వం బడిబాట చేపడుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జూన్ 19 వరకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుని చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం వినూత్నమైన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతోపాటు దుస్తులు ఇతర విద్యాభ్యాసకరమైన సామాగ్రిలను ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. గ్రామాల్లో పోషకులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘం సభ్యులు, విద్యార్థులు, పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



చింతల్‌బోరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భైంసా: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డీఎల్‌పీవో మోజమ్ హుస్సేన్, భైంసా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాడ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతోపాటు రెండు జతల దుస్తులు ఇస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రతినిధులు వానల్‌పాడ్‌లో ర్యాలీ నిర్వహించారు. పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇందులో ఎంఈవో సుభాష్ పాల్గొన్నారు. భైంసా పట్టణ, మండల పరిధిలోని అన్నిప్రాంతాల్లో ర్యాలీలు జరిగాయి.

గ్రామాల్లో బడిబాట ర్యాలీలు



బాసర మండల కేంద్రంలో..

బాసర: బాసర మండలం వివిధ గ్రామాల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీలు నిర్వహించారు. పిల్లలను బడిలో చేర్పించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లకార్డులు, నినాదాలు, ఫ్లెక్సీ బ్యానర్లతో ర్యాలీలు కొనసాగాయి. మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలలో తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంఈవో మైసాజీ, ఎంపీడీవో అశోక్, ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.